నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | ఆదివారం 10 మార్చి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

జూనియర్ సివిల్ జడ్జి గడ్డం మేఘనకు సన్మానం

మేఘనను సన్మానిస్తున్న హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి

కాసిపేట, మార్చి 9 : కాసిపేట మండలంలోని దేవాపూర్‌కు చెందిన గడ్డం మేఘన మొదటి ప్రయత్నంలోనే రెండు రాష్ట్రాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన సందర్భంగా ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ ఉస్మానియా విశ్వ విద్యాలయం న్యాయ కళాశాల ఆధ్వర్యంలో డీయూసీఐఎంయూసీ-2024 లిటరసీ అండ్ కల్చరల్ ఫెస్టివల్‌లో గడ్డం మేఘనను తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అడిషనల్ అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రారావు, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ రవీందర్ యాదవ్, సీనియర్ ప్రొఫెసర్ జబీ రెడ్డి, ప్రిన్సిపాల్ రాధిక యాదవ్, న్యాయ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

పిన్సింగుల సాయిచరణ్

గట్టు గోపాల్

రెబ్బెన, మార్చి 9 : బిహార్ రాష్ట్రం పాట్నాలో ఈ నెలా 10 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్న అండర్-19 బాలుర జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు గోలేటికి చెందిన క్రీడాకారులు గట్టు గోపాల్, పిన్సింగుల సాయిచరణ్ ఎంపికైనట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ప్రధాన కార్యదర్శి ఆర్.నారాయణరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు నర్సింగం, సంయుక్త కార్యదర్శి ఎస్.తిరుపతి, సెపక్ తక్రా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసరెడ్డి, టగ్ ఆఫ్ వార్ ప్రధాన కార్యదర్శి భాస్కర్, షార్ప్‌స్టార్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, కోశాధికారి శంకర్, సీనియర్ క్రీడాకారులు కుమ్మరి మల్లేశ్, రామకృష్ణ, హరిలాల్, గుజ్జ మల్లేశ్, చందర్ క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

కొండగట్టు ఘాట్‌రోడ్డులో ట్రాలీ ఆటో బోల్తా

- 11 మందికి గాయాలు.. జగిత్యాల దవాఖానకు తరలింపు
- క్షతగాత్రులు మ్యాదరిపేట వాసులు

కొండగట్టు ఘాట్ రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులు

మల్యాల, మార్చి 9 : జగిత్యాల జిల్లా కొండగట్టు ఘాట్ రోడ్డులో శనివారం ట్రాలీ ఆటో బోల్తాపడగా, మంచిర్యాల జిల్లాకు చెందిన 11మంది గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా దండేపల్లిలోని మ్యాదరిపేటకు చెందిన గంధం జగన్ కుటుంబసభ్యులతో కలిసి శుక్రవారం రాత్రి ట్రాలీ ఆటోలో కొండగట్టు హనుమాన్ ఆలయానికి చేరుకున్నాడు. స్వామివారి దర్శనం తర్వాత శనివారం ఉదయం ట్రాలీ ఆటోలో కొండఘాట్‌రోడ్డు మార్గంలో తిరుగుపయనమయ్యారు. కొంత దూరం వెళ్లిన తర్వాత ఆటో అదుపుతప్పి రోడ్డు సైడ్‌వాల్‌ను ఢీకొట్టి బోల్తాపడ్డది. ఈ ఘటనలో జగన్‌తో పాటు 10 మంది గాయపడ్డారు. చికిత్సకోసం '108'లో జగిత్యాల దవాఖానకు తరలించారు.

గోవర్‌గూడ గోడు పట్టదా..?

- పునరావాస గ్రామంపై పట్టింపు కరువు
- ఖైరిగూడ ఓపెన్‌కాస్ట్ పేలుళ్ల తో దెబ్బ తింటున్న ఇళ్లు
- ఎప్పుడు కూలిపోతాయో తెలియని దుస్థితి
- నిత్యం భయాందోళ నల మధ్య బతుకులీడుస్తున్న కొలాం గిరిజనులు
- 18 ఏళ్లవుతున్నా అందని పరిహారం
- నిత్యం దుమ్మూ ధూళితో కొలాంల సతమతం
- ఊరును వదల లేక.. ఇళ్లలో ఉండలేక నరకం
- సర్కారు ఆదుకోవాలని వేడుకోలు

పగుళ్లు తేలుతున్న ఇండ్లు

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/తిర్యాణి, మార్చి 9 : ప్రస్తుతం ఖైరిగూడ ఓపెన్‌కాస్టుకు సుమారు అర కిలోమీటరు దూరంలోనున్న గోవర్ గూడ గ్రామం.. ఒకప్పుడు వేరే ప్రాంతంలో ఉండేది. సుమారు 18 ఏళ్ల క్రితం ఖైరిగూడ ఓపెన్‌కాస్ట్ ఏర్పాటు సమయంలో ముంపు గ్రామంగా గుర్తించిన అధికారులు అక్కడి నుంచి ఇక్కడికి తరలించారు. ఆ సమయంలో దూరంగా పునరావాసం కల్పించకుండా మళ్లీ ఓపెన్‌కాస్ట్ పక్కనే గ్రామాన్ని ఏర్పాటు చేశారు. అదే సమయంలో సర్కారు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి, కట్టించింది. మౌలిక వసతులు కల్పించాల్సిన సింగరేణి అధికారులు, కేవలం సీసీ రోడ్డు వేసి వదిలేశారు. ఊరిని వదిలి వచ్చినందుకు ఎలాంటి ఆర్థిక సాయమందించలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు వంద ఎకరాల భూములు కోల్పోయామని, కొంత మందికి మాత్రమే ఎకరాకు రూ. ఆరు వేల దాకా పరిహారమిచ్చి చేతులు దులుపుకున్నారని, మిగతా వారిని పట్టించుకోలేదని, 18 ఏళ్లుగా పరిహారం కోసం ఎదురుచూస్తున్నామని వారు పేర్కొంటున్నారు. ఓపెన్‌కాస్టు దుమ్ము వల్ల కనీసం మిగిలి ఉన్న భూముల్లోనైనా పంటలు వేసే పరిస్థితి లేదని ఆవేదన చెందుతున్నారు. మౌలిక వసతులతో పాటు ఉపాధి అవకాశాలు కూడా కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేలుళ్లు.. దట్టమైన దుమ్ముతో నిత్యం నరకం అనుభవిస్తున్నామని, తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.


గోవర్ గూడ గ్రామం

ఈ చిత్రంలో కనిపిస్తున్నది తిర్యాణి మండలంలోని గోవర్ గూడ గ్రామం. ఇక్కడ 28 కొలాం కుటుంబాలు నివసిస్తున్నాయి. పక్కనే ఉన్న ఖైరిగూడ ఓపెన్ కాస్టు పేలుళ్లతో ఊరిలోని ఇండ్లన్నీ పగుళ్లు తేలి కూలిపోయే దుస్థితి వచ్చింది. ఈ పునరావాస గ్రామంలో మౌలిక వసతులు కల్పించాల్సిన సింగరేణి అధికారులు, కేవలం సీసీ రోడ్డు వేసి చేతులు దులుపుకున్నారే తప్ప.. తమ గోడును పట్టించుకోవడం లేదంటూ గిరిజనం మండిపడుతున్నది. అటు ఊరిని వదిలి వెళ్లలేక.. ఇటు ఇళ్లలో ఉండలేక నిత్యం భయాందోళనల మధ్య బతుకులీడుస్తున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నది.

ఎప్పుడు కూలిపోయేది తెల్వదు

ఒకప్పుడు మా ఊరు వేరే చోట ఉండేది. ఓపెన్‌కాస్టు పడుతుందని ఇక్కడికి తీసుకొచ్చిన్రు. ఖైరిగూడకు దాదాపు అర కిలోమీటర్ దూరంలోనే గ్రామాన్ని ఏర్పాటు చేసిన్రు. కనీసం సౌకర్యాలు కూడా కల్పించలే. ఒక్క రోడ్డేసిన్రు. ఓపెన్‌కాస్టు పేలుళ్లతో మా ఇండ్లన్నీ దెబ్బతింటున్నయ్. గోడలన్నీ పగుళ్లు చూపినయ్. ఎప్పుడు కూలిపోతయోనని భయపడుతున్నం. మా గ్రామాన్ని సురక్షితమైన ప్రాంతానికి తరలించి ఆదుకోవాలి. *- ఆత్రం గుండయ్య, గోవగూడ*

గ్రామం పక్కనే ఉన్న ఓపెన్ కాస్టు

ఎకరంన్నర భూమి వదిలేసి వచ్చిన

మాకు ఎకరంన్నర భూమి ఉండే. ఓపెన్‌కాస్టు కింద పోయింది. బంగారంలాంటి భూమి వదిలేసి రావాల్సి వచ్చింది. మంచిగ పంటలేసుకొని బతికేటోళ్లం. గా భూమి తీసుకున్నోళ్లు కనీసం ఇంత వరకు పరిహారం కూడా ఇవ్వలే. అడిగితే మా భూమి ముంపులో పోలేదన్నరు. అందులో పంటలేసుకుందామంటే ఓపెన్‌కాస్టు దుమ్ముతో పండడం లేదు. ఇక్కడ బతుకుడు కష్టమైతంది. సర్కారోళ్లే మాకు న్యాయం చేయాలే.

- ఆత్రం నాగు, గ్రామ పటేల్

ప్రొటోకాల్ రగడ

- కస్తూర్బాలో అదనపు గదుల ప్రారంభోత్సవంలో గొడవ
- ఎమ్మెల్యే రాకుండా జడ్పీ చైర్మన్‌తో ఎలా రిబ్బన్‌కట్ చేయిస్తారని మండిపడ్డ బీజేపీ
- అధికారులతో వాగ్వాదం.. వెనుదిరిగిన పాల్వాయి హరీశ్
- ఆపై ప్రారంభోత్సవం చేసిన జడ్పీ చైర్మన్

ఎంపీపీ సువర్ణతో కలసి కస్తూర్బా కళాశాల అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు..

ప్రొటోకాల్‌పై అధికారులతో మాట్లాడుతున్న స్థానిక బీజేపీ నాయకులు

సిర్పూర్(టీ), మార్చి 9 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టీ) మండల కేంద్రంలోని కస్తూర్బాలో ఇంటర్ కళాశాల అదనపు గదుల ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్‌పై శనివారం రగడ జరిగింది. కస్తూర్బా విద్యాలయంలో ఇంటర్ కళాశాలకు అదనపు గదుల నిర్మాణం కోసం 2020లో రూ. 2.05 కోట్లతో అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప భూమిపూజ చేశారు. పనులు పూర్తికాగా, శనివారం ప్రారంభించేందుకు సిర్పూర్(టీ) ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబును ముఖ్య అతిథిగా, జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావును విశిష్ట అతిథిగా అధికారులు ఆహ్వానించారు. మొదట జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు రాగా, అప్పటి వరకు హరీశ్‌బాబు రాలేదు. అక్కడ ఎండగా ఉండడంతో అధికారులు కృష్ణారావును లోపలికి తీసుకెళ్లారు. ఆ క్రమంలో గేటు దగ్గర అడ్డుగా ఉన్న రిబ్బన్‌ను అక్కడున్న ఓ అధికారి తొలగించారు. దీంతో అక్కడ గందరగోళం నెలకొంది. అక్కడున్న బీజేపీ కార్యకర్తలు, నాయకులు జడ్పీ చైర్మన్‌తో రిబ్బన్ కట్ చేయించారని, ఇది మా ఎమ్మెల్యేను అవమానించడమేనని అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఇంతలో అక్కడికి వచ్చిన ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబును బీజేపీ నాయకులు అక్కడి నుంచి తీసుకెళ్లారు. అధికారులు వెళ్లి ఆయనను మరోసారి ఆహ్వానించినా.. సున్నితంగా తిరస్కరించారు. మరో తేదీన కళాశాలను ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. కాగా, దాదాపు రెండు గంటల పాటు వేచి చూసిన అనంతరం జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు ఎంపీపీ చునార్కర్ సువర్ణ, వైస్ ఎంపీపీ ఈర్ల సత్యనారాయణతో కలసి ప్రారంభించారు. ఆ సమయంలో సంబంధిత అధికారులు, పాఠశాల ఎస్‌వో నాగసుధ లేకపోవడం గమనార్హం. ప్రొటోకాల్ వివాదంపై ఏఈఈ శరత్‌ను ఫోన్‌లో సంప్రదించగా తాము ఎలాంటి తప్పు చేయలేదని, ఆ రిబ్బన్‌ను ఎవరూ కట్ చేయలేదన్నారు.

వైభవంగా సామూహిక వివాహాలు

తలంబ్రాలు పోసుకుంటున్న వధూవరులు

నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

- మహాగాంవ్‌లో 12 జంటలకు పెళ్లిళ్లు
- వధూవరులకు వస్త్రాలు, మంగళ సూత్రాలు అందించిన ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, బొజ్జు పటేల్

సిర్పూర్(యు) ఫిబ్రవరి 9 : మహాగాంవ్‌లోని సంత్ శ్రీ సూరోజీ బాబా ఆశ్రమం ఆధ్వర్యంలో శనివారం సామూహిక వివాహాలు వైభవంగా జరిపించారు. యేటా మహాశివరాత్రిని పురస్కరించుకొని శ్రీ సంత్ సూరోజీ బాబా ఆశ్రమంలో సామూహిక వివాహాలు జరిపించడం ఆనవాయితీగా వస్తున్నది. ఇందులో భాగం గా ఈసారి 12 జంటలకు ఆదివాసీ సంప్రదాయం ప్రకారం పెళ్లిళ్లు జరిపించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జడ్పీటీసీ అరుణ వధూవరులకు వస్త్రాలతో పాటు మెట్టెలు, మంగళసూత్రాలు అందజేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కూడా వారికి దుస్తులు పంపిణీ చేశారు. ఎంపీపీ తొడసం భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ ఆత్రం ప్రకాశ్, సింగిల్ విండో చైర్మన్ కేంద్రె శివాజీ, జిల్లా గ్రాంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవ్‌రావ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సెడ్మకి సీతారాం, మాజీ సర్పంచు ఆత్రం పద్మబాయి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తొడసం ధర్మారావ్, నాయకులు ఆత్రం కిషన్ మహారాజ్, కుమ్ర దేవ్‌రావ్ మహారాజ్, ఆత్రం భీంరావ్, సురోజీ బాబా ఆశ్రమ కమిటీ సభ్యులు మెస్రం భూపతి, ఆత్రం రాజేశ్వర్, ఆత్రం ఆనంద్‌రావ్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

వేలాలకు పోటెత్తిన భక్తులు

- మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు
- పట్నాలు వేసి.. బోనాలు సమర్పణ
- జాతరలో భారీ పోలీసు బందోబస్తు

వేలాల ఆలయం వద్ద పట్నాలు వేస్తున్న భక్తులు

జైపూర్, మార్చి 9 : వేలాల జాతరకు శనివారం రెండో రోజూ భక్తులు పోటెత్తారు. శుక్రవారం గుట్టపై గట్టు మల్లన్నకు మొక్కులు చెల్లించుకున్న భక్తులు, శనివారం సమీప గోదావరి పుష్కరఘాట్ల వద్ద పుణ్యస్నానాలాచరించారు. గొర్రె పిల్లలతో గోదారమ్మకు మొక్కులు అప్పగించారు. ఆపై మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. పట్నాలు వేసి బోనాలు సమర్పించారు. ఎంపీడీవో సత్యనారాయణ సిబ్బందితో కలిసి పుష్కరఘాట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పారిశుధ్య లోపం తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. జాతరలో అన్ని సౌకర్యాలు కల్పించినట్లు ఆలయ ఈవో రమేశ్ తెలిపారు. ఇక ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సీసీ కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. శ్రీరాంపూర్ సీఐ బన్సీలాల్ , జైపూర్ ఏస్ఐ ఉపేందర్‌రావుతో పాటు సిబ్బంది భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూశారు.

వేలాల ఆలయం వద్ద స్వామి దర్శనం కోసం భక్తుల క్యూ

ఎస్ఐల బదిలీ

మంచిర్యాల ఏసీసీ, మార్చి 9 : మంచిర్యాల జిల్లాలో పలువురు ఎస్ఐలను బదిలీ చేస్తూ శనివారం మల్టీజోన్-1 ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. మంచిర్యాల పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ కే.జగదీశ్‌ను తాండూర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. రామగుండం వీఆర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఎస్.లక్ష్మణ్‌ను మంచిర్యాల టౌన్ పోలీస్‌స్టేషన్‌కు, వీఆర్ రామగుండం ఎస్ఐ టీ.జితేందర్‌సింగ్‌ను సీసీసీ నస్పూర్ పీఎస్‌కు, సీసీఎస్ పెద్దపల్లి ఎస్ఐ-1 ఎన్ స్వరూప్‌రాజ్‌ను దండేపల్లి పీఎస్ ఎస్‌హెచ్‌వోగా, వీఆర్ రామగుండం ఎస్ఐ ఎం.లక్ష్మీనారాయణను శ్రీరాంపూర్ ఎస్ఐ-2గా, నెన్నెల ఎస్‌హెచ్‌వో పీ.శ్యాంపటేల్‌ను నీల్వాయ్ పీఎస్‌కు, నీల్వాయి ఎస్‌హెచ్‌వో పీ.సుబ్బారావును వీఆర్ రామగుండానికి బదిలీ చేశారు. మంచిర్యాల టౌన్ ఎస్ఐ-3 కుందారపు ప్రసాద్‌ను ఎస్‌హెచ్‌వో నెన్నెల పీఎస్‌కు, డబ్ల్యూపీఎస్ శ్రీరాంపూర్ ఎస్ఐ ఎం.విజయ్‌కుమార్‌ను హెచ్ఎస్‌వో భీమినికి, కాసిపేట నుంచి ఏ.గంగారాంను ఎస్‌హెచ్‌వో కన్నెపల్లి పీఎస్‌కు, భీమిని పీఎస్ నుంచి ఎం.ప్రశాంత్ వీఆర్ రామగుండంకు, వీ.ప్రవీణ్ ఎస్ఐ-2 బెల్లంపల్లి-1 పట్టణ పీఎస్ నుంచి ఎస్‌హెచ్‌వో కాసిపేట పీఎస్‌కు, యూ.ఉపేందర్ ఎస్‌హెచ్‌వో జైపూర్ పీఎస్ నుంచి ఎస్ఐ-1 టాస్క్‌ఫోర్స్ రామగుండం (మంచిర్యాల)కు, సీహెచ్ కిరణ్‌కుమార్ వీఆర్ రామగుండం నుంచి ఎస్ఐ-4 సీసీఎస్ మంచిర్యాలకు, కే.నరేశ్ (యూ/ఎస్) ఎస్‌హెచ్‌వో దండెపల్లి నుంచి వీఆర్ రామగుండంకు, రామగుండం ట్రాఫిక్ విభాంగాలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న జీ.అనూషను మంచిర్యాల టౌన్ పోలీస్‌స్టేషన్‌కు నాలుగో ఎస్ఐగా బదిలీ చేశారు.

బుగ్గ జాతరలో భక్తుల పాట్లు

- కనీస సౌకర్యాలు కల్పించని అధికారులు
- అన్ని ఏర్పాట్లు చేయలేక పోయామంటూ బహిరంగంగానే మైకులో అనౌన్స్
- మట్టి రోడ్డుపై నీళ్ల క్యూరింగ్ చేయక తీవ్ర ఇబ్బందులు
- రహస్యంగా హుండీ లెక్కింపుపై అనుమానాలు
- చెల్లని వీఐపీ, ప్రెస్ పాసులు

బుగ్గ మట్టి రోడ్డుపై క్యూరింగ్ చేయకపోవడంతో దుమ్ముతో ఇబ్బంది పడుతున్న భక్తులు

బెల్లంపల్లిరూరల్, మార్చి 9 : మండలంలోని కన్నాల బుగ్గ రాజరాజేశ్వరస్వామి జాతరలో సౌకర్యాలపై దేవాదాయశాఖ అధికారులు, కమిటీ సభ్యుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. బెల్లంపల్లికి ఆరు కిలోమీటర్ల దూరంలోనున్న ఈ ఆలయానికి 3 కిలోమీటర్ల వరకు మట్టి రోడ్డు ఉండగా, కనీసం నీళ్లతో క్యూరింగ్ చేయకపోవడంతో భక్తులు దుమ్ముతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఆదాయంపై చూపిన శ్రద్ధ సౌకర్యాలపై చూపించలేదని వారు మండిపడ్డారు. జాతరలో స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు తాగునీరు, అల్పాహారం, మజ్జిగలాంటివి అందించగా, అధికారులు, కమిటీ సభ్యులు మాత్రం కనీస సౌకర్యాలు కల్పించలేదు. పైగా భక్తులకు సరైన ఏర్పాట్లు చేయలేకపోయామంటూ బహిరంగంగానే దేవాదాయశాఖ అధికారులు మైకుల్లో అనౌన్స్ చేయడం చర్చనీయాంశమైంది. ఇక జాతర హుండీ లెక్కింపు సమాచారం కూడా బయటికి పొక్కకుండా రహస్యంగా నిర్వహిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తున్నది.

పనిచేయని పాసులు..

మరోవైపు రెవెన్యూ డివిజనల్ అధికారి నుంచి వీఐపీ, ప్రెస్ పాసులు జారీ చేయగా, అవి ఎందుకూ పనికిరాలేదు. వీఐపీ పాసుల్లో ఉదయం 9 గంటల వరకే దర్శనం కోసం అనుమతి అని ఉండగా, రాత్రి వరకూ వారికి ఆ భాగ్యం కలగలేదు. మీడియాకు పాసులిచ్చి అవమానపర్చే విధంగా వ్యవహరించారు. ప్రత్యేక పాసులుగా పేర్కొన్నప్పటికీ భక్తులు, వీఐపీల దర్శనం ఫొటోలను కవరేజ్ చేసేందుకు ఆలయంలోకి అనుమతించలేదు. జాతర కవరేజీకి వచ్చిన మీడియా పట్ల దేవాలయ కమిటీకి చెందిన కొందరు అత్యుత్సాహం ప్రదర్శించారు. ప్రత్యేక ప్రెస్ పాసులు ఉన్నప్పటికీ మీడియాను నేరుగా అనుమతించకుండా భక్తులతోపాటే క్యూలైన్‌లో పంపించారు. ప్రముఖుల ఫొటోల కవరేజ్‌లో మీడియాకు అడుగడుగునా కిందిస్థాయి పోలీసుసిబ్బంది, దేవాలయ కమిటీ సభ్యుల నుంచి ఇబ్బందులు తప్పలేదు. కనీసం రాత్రి 10 గంటలకు జరిగిన శివపార్వతుల కల్యాణ మహోత్సవానికి సైతం అనుమతించలేదు. వెనుక ద్వారం వద్ద విధుల్లో ఉన్న కానిస్టేబుళ్లకు ప్రెస్ పాసులు చూపించినా అడ్డుకున్నారు. అక్కడే ఉన్న ఒక ఎస్సై స్థాయి అధికారి ఓ పాత్రికేయుడిపై దురుసుగా ప్రవర్తించారు. పోలీసు అధికారుల కుటుంబసభ్యులు, ఇతర ఉన్నతాధికారులు మాత్రమే దేవాలయం వెనుక ద్వారం గుండా గర్భగుడిలోకి వెళ్లి దర్శనం చేసుకున్నారు.